క్లుప్తంగా

ఎంఈవోగా రమేష్‌కుమార్


రమేష్‌కుమార్

బొబ్బిలి: ఎంఈవో(మండల విద్యాశాఖ అధికారి)గా చిప్పాడ రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఇంతవరకు ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన చల్ల లక్ష్మణరావు ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈయనను నియమించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

రాజాం సిటీ: పట్టణంలో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్, స్నేహం అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుని ఆనందంగా గడిపారు.

బొబ్బిలి: స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఆపదలో ఉన్న స్నేహితుల కోసం ఏదైనా సాయం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి సరదాగా గడిపారు.

పుస్తకావిష్కరణ

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో తేట తెలుగు శతకం పుస్తకాన్ని ఎమ్మెల్యే బేబీనాయన ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. తెలుగు భాషను మరింతమందికి చేరువ చేసేలా చింత రమణ మాస్టారు ఈ పుస్తకాన్ని చాలా బాగా రాశారని వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో గాదె శ్రీనివాసులు నాయుడు, ఎంపీడీవో పి.రవికుమార్, కరస్పాండెంట్ ఆర్.వాసుదేవరావు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలి


సమావేశమైన మాజీ సైనికులు

బొబ్బిలి: పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్, మరడ రామినాయుడులు కోరారు. మండల కేంద్రంలోని మాజీ సైనికుల సంఘ కార్యాలయంలో ఆ సంఘ సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ నెల 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం వైభవంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అలాగే మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.

గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


గ్రంథాలయంలో కొత్తగా నిర్మించిన టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న జనార్దనరావు

రాజాం సిటీ: విద్యార్థులంతా గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్ఎస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అల్లాడ జనార్దనరావు కోరారు. మండలంలోని కంచరాం గ్రామంలోని గ్రంథాలయంలో తన ఆర్థిక సాయంతో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా నిర్మించిన టాయిలెట్స్(మరుగుదొడ్లు)ను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని మరింత ఆదర్శవంతంగా తయారు చేయాలని నిర్వాహకులను కోరారు. అలాగే దాతలు సహకరించి నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందించాలన్నారు. గ్రంథాలయాల్లో చదువుకుని ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

మోక్షప్రదాయిని భగవద్గీత


భగవద్గీత గొప్పతనం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ

రేగిడి: మోక్ష ప్రదాయిని భగవద్గీత అని, ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని పాలకొండకు చెందిన సత్యసాయి ప్రతినిధి ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం ఆదివారం జరిగింది. భగవద్గీతను పఠిస్తే చెడు గీతలు చెరిగిపోతాయన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ క్షణం తీరిక లేకుండా ఉండడం వల్ల మానసిక ప్రశాంతత లేకుండా పోతోందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనే మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎంతో కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి, ఎం. సూర్యనారాయణ పాల్గొన్నారు.

హామీలన్నీ ఎక్కడ అమలు చేశారు?

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్


బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: ఎన్నికల సమయంలో లెక్కలేనన్ని హామీలిచ్చి, ఇప్పుడు అరకొరగా రెండు, మూడు పథకాలు అమలు చేసి చేతులు దులుపుకోవడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని మల్లిఖార్జునకాలనీలో ఆయన ఆదివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం గడిచినా హామీలన్నీ అమలు చేయలేకపోయారని విమర్శించారు. ఇచ్చిన రెండు, మూడు పథకాల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని, అవి కొంతమందికే వస్తున్నాయని ఆరోపించారు. తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి కేవలం రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారని, ఈ డబ్బులు కూడా చాలామంది అర్హుల తల్లుల ఖాతాల్లో జమ కాలేదని ధ్వజమెత్తారు. డబ్బులు పడిన వారిలో కూడా తేడాలున్నాయని, ఒక్కొక్కరికి ఒక్కో విధంగా పడ్డాయన్నారు. ఒకరికి రూ.13 వేలు పడితే మరొకరికి రూ.10 వేలు, ఇంకొకరికి రూ.8 వేలు ఇలా పడ్డాయన్నారు. ఇటీవల ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకంలోనూ మోసమే చేశారన్నారు. చాలా మంది అర్హులకు ఇంకా డబ్బులు వేయలేదన్నారు. ఎన్నికల సమయంలో అధికారమే లక్ష్యంగా ప్రజలకు అమలు సాధ్యంకాని హామీలు ఎన్నో ఇచ్చారని, అవన్నీ ఎక్కడ అమలు చేశారని నిలదీశారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్లు దాటిన బీసీలకు పింఛన్, నిరుద్యోగ భృతి వంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు.

ప్రతి హామీ నెరవేర్చాలి..

గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేసి, అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందివ్వడం జరిగిందని గుర్తు చేశారు. కూటమి ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని, ప్రజలను మోసం చేస్తే ఊరుకోబోమన్నారు. ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నియోజకవర్గ కన్వీనర్ ఆసపు సూర్యం, కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, జిల్లా కల్చరల్ వింగ్ కన్వీనర్ డాక్టర్ నరేంద్ర, పెన్షనర్ల వింగ్ కన్వీనర్ పాలవలస శ్యామ్‌సుందరరావు, వలంటీర్ల వింగ్ కన్వీనర్ దాసరి అనూష, వీవర్స్ వింగ్ అధ్యక్షులు బొమ్మన సూర్యనారాయణ, కొల్ల రమ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందివ్వడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందివ్వడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ విమర్శించారు. మండల కేంద్రానికి ఆదివారం విచ్చేసిన ఆయన ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకురాలిని పరామర్శించి, కాసేపు విలేకరులతో మాట్లాడారు. కార్యాచరణ లేకుండా సాగునీటిని విడుదల చేయడంతో వంగర, గరుగుబిల్లి మండలాల్లో దమ్ములు పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. వంగర మండలంలోని శివారు గ్రామాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అటు విత్తనాలు, ఇటు ఎరువుల సరఫరాల్లోనూ ప్రభుత్వం చేతులెత్తేసిందని, రైతులంతా ఉసూరుమంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో గతంలో కన్నా లబ్ధిదారుల సంఖ్య తగ్గించి పథకం అమలు చేశారని, గతేడాది నిధులకు ఎగనామం పెట్టారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరిస్తున్నామన్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలు కూడా తెలుసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు, నాయకులు కనగల పారినాయుడు, బొక్కేల వెంకట అప్పలనాయుడు, గొండేల తవిటయ్య మాస్టారు, తూముల స్వామినాయుడు, సీతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ


చంద్రినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

రాజాం: మండలంలోని పొగిరి గ్రామానికి చెందిన రేషన్ డిపో డీలర్ పొగిరి చంద్రినాయుడు ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు ఆదివారం కలిసి పరామర్శించారు. అనంతరం చంద్రినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, సర్పంచ్ పొగిరి లెనిన్, మాజీ సర్పంచ్ జడ్డు జగదీష్ పాల్గొన్నారు.

సన్మానం

రాజాం సిటీ: స్థానిక సాయినగర్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బొద్దాం గ్రామానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ రఘుపాత్రుని భీమారావును ఆదివారం సన్మానించారు. అనంతరం ఆయన సేవలను రాజాం రోటరీ క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు ప్రశంసించారు. ఆయన వృత్తి, ప్రవృత్తి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అంతర్జాతీయ సత్కారాలు పొందిన రొటేరియన్ రఘుపాత్రుని భీమారావు సేవలు ఆదర్శనీయమన్నారు. శాస్త్రవేత్తగా ఖనిజ బెనిఫిషియేషన్ రంగంలో అద్భుత ప్రతిభాపాటవాలతో ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులకు వసతి కల్పించడంతో పాటు డాక్టరేట్ చదువులకు ప్రోత్సాహాన్ని అందించి సేవానిరతిని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ వసంతరావు, పక్కి వాసు తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి: సన్మాన సభలో ఎంఈవో సేవలు ప్రశంసిస్తున్న ఉప విద్యాశాఖాధికారి మోహనరావు

బొబ్బిలి: ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు ఉద్యోగ విరమణ పురస్కరించుకుని, పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో లక్ష్మణరావు దంపతులను ఎమ్మెల్యే బేబీనాయన, ఉప విద్యాశాఖాధికారి కె.మోహనరావులు సత్కరించి, ఆయన సేవలను ప్రశంసించారు. రిటైర్‌మెంట్ అనంతర కాలం నిండు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


యడ్ల గోపాలరావును సత్కరిస్తున్న కళా క్రియేషన్స్ సభ్యులు

రాజాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం కళా క్రియేషన్స్–రాజాం(డోలపేట) వారు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 75వ నెలవారీ సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ప్రముఖ రంగస్థల కళాకారుడు గోకవలస కృష్ణమూర్తి మనుమరాలు నొగట్ల రియాన్స్(జర్మనీ) చేసిన కూచిపూడి నృత్యం, గోకవలస జోషిక చేసిన భరతనాట్యం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. అనంతరం మందరాడకు చెందిన రంగస్థల కళాకారుడు పద్మశ్రీ యడ్ల గోపాలరావును రాజాం జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళా క్రియేషన్స్ ప్రెసిడెంట్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్.. కళా క్రియేషన్స్ సేవలు వివరించారు. సన్మాన గ్రహీత యడ్ల గోపాలరావు మాట్లాడుతూ ఈ సన్మానం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. కళలకు ఇంకా గుర్తింపు ఉందంటే కళాభిమానులు, కళాక్రియేషన్లే కారణమని ప్రశంసించారు. అనంతరం కళాక్రియేషన్స్ వారిచే కెరటాలు అనే సాంఘిక నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, మానవతా సంస్థ అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం విషయంలో.. చంద్రబాబు నిజస్వరూపం మరోసారి బయటపడింది..

- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: నాడు వ్యవసాయం దండగన్న చంద్రబాబు..నేడు కూడా ఆయన..ఈ చంద్రన్న ఉన్నంత వరకు రైతుకు భరోసా ఉండదు, ఉండబోదని తన మనసులోని మాటను బయటపెడుతూ మరోసారి తన నిజస్వరూపం చూపించారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లా, వీరాయపాలెంలో పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ పథకం నిధులు జమచేసే కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తూ రైతుల పట్ల తనకున్న చులకన భావాన్ని చాటారని గుర్తు చేశారు. రైతన్నలు పాల్గొన్న బహిరంగ సభలో రైతుకు భరోసా ఉండదని ఆయన చేసిన వ్యాఖ్యలు యావత్తు రైతాంగాన్ని విస్మయానికి గురిచేశాయన్నారు. ఎన్నికల సమయంలో కేంద్రం నిధులతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఇస్తామని, ఇప్పుడు కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి మొత్తం రూ.20 వేలు వేస్తుండడం దుర్మార్గం కాదా అని నిలదీశారు. ఇదేనా రైతుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధతా అని ప్రశ్నించారు.

గతేడాది డబ్బులు ఎగ్గొట్టారు..

ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలల తర్వాత కేవలం రూ.5 వేలు వేస్తూ రైతులను మోసం చేశారని ధ్వజమెత్తారు. గతేడాది ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టేశారని దుయ్యబట్టారు. విత్తనాల సరఫరా దగ్గర నుంచి ఇప్పుడు ఎరువులు అందివ్వడం వరకు అన్ని దశల్లోనూ కూటమి విఫలమైందన్నారు. దేశానికి వెన్నెముకైన అన్నదాతను కూడా చంద్రబాబు వదలడం లేదని, వారిని మోసం చేస్తూనే ఉన్నారు. ఆఖరికి పంటల బీమా కూడా రైతులతో కట్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని, లేకుంటే ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● అధ్వానంగా రోడ్డు



రాజాం మండలం, పొగిరి, బొడ్డవలస గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా ఉంది. దారంతా గోతులమయం కావడంతో పాటు మట్టిరోడ్డు కావడంతో ఏ చిన్నపాటి వర్షం పడినా రహదారి మొత్తం బురదమయమవుతోంది. దీంతో ఆ దారిన ప్రజల రాకపోకలు కష్టంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అద్దాల్లా మెరిసే రోడ్లు వేసి చూపిస్తామని చెప్పారని, ఇలాగేనా చేసేది..ఇదేనా అని రోడ్డును చూసి పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేయాలని, బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. –రాజాం

● పాల్తేరు చానల్‌లో 'ఉపాధి' పనులేవీ?



ఈ చిత్రంలో కనిపిస్తోంది.. బాడంగి మండలంలోని ముగడ–పాల్తేరు మధ్య ఉన్న సాగునీటి కాలువ. ఈ ఏడాది ఈ కాలువలో ఉపాధి పథకం పనులు చేయకపోవడంతో ఇలా పిచ్చిమొక్కలు, పూడికలతో పూర్తిగా నిండి ఉంది. దీంతో దిగువ ప్రాంతాల పంటపొలాలకు సాగునీరు అందడం లేదు. ఇలా చేస్తే పంటలు ఏ విధంగా పండించుకోవాలని బాధిత ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలువను బాగు చేసి సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. –బాడంగి

● రేషన్ అవస్థలు



రేషన్ లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం గతంలోని ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేసి, పాత విధానంలోనే రేషన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మళ్లీ ఎప్పటిలాగే రేషన్ షాపుల వద్ద క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల తరబడి నిలబడితే తప్ప రేషన్ రావడం లేదు. దీనికితోడు ఆ రేషన్ బియ్యం నెత్తిన పెట్టుకుని మోసుకురావాల్సిన దుస్థితి. ఇదంతా స్వీయ అనుభవం చెందుతున్న వారు వైఎస్సార్ సీపీ హయాంలోనే బాగుండేదని, ఇంటి దగ్గరకే రేషన్ బండి వచ్చేదని అభిప్రాయపడుతున్నారు. ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బాడంగి మండల కేంద్రంలోని రేషన్ డిపో–2 నుంచి పలువురు ఇలా బియ్యం మోసుకువస్తున్న దృశ్యాన్ని ఈ చిత్రంలో చూడొచ్చు. –బాడంగి

కూటమి పాలనలో రైతులకు మోసం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

వంగర: కూటమి పాలనలో రైతులకు మోసం జరుగుతోందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు విమర్శించారు. ఇదే విషయమై వారు మండలంలోని మద్దువలస గ్రామంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు వస్తే కరువు వస్తుందని, కరువు–చంద్రబాబు రెండూ కవల పిల్లలని ఎద్దేవా చేశారు. అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు చంద్రబాబు సర్కారు తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ నిధులతో కలిపి రూ.20 వేలు ఇస్తామని చెబుతుండడం దుర్మార్గమన్నారు. ఇదే పథకం నిధులు తొలి ఏడాది అందించకుండా రైతు నోట్లో మట్టి కొట్టారన్నారు. ఈ ఏడాది 7 లక్షల మందికి పథకం దూరం చేశారన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులున్నాయని, కరువు దాపురిస్తోందని, ఇటువంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సింది పోయి వారిని ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. సకాలంలో విత్తనాలు సరఫరా చేయలేదని, ఎరువులు కూడా అందివ్వలేని దుస్థితిలో ఉన్నారని ధ్వజమెత్తారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంటల బీమాను ఉచితంగా చేయిస్తే ఇప్పుడు రైతులనే బీమా చేయించుకోవాలని చెబుతుండడం అన్యాయమన్నారు. చంద్రబాబే స్వయంగా మీ చంద్రన్న ఉన్నంత వరకు రైతుకు భరోసా లేదు.. ఉండదు అని ఆయన చేసిన వ్యాఖ్యలు రైతుల పట్ల ఆయన అసలైన వైఖరి బయటపెట్టిందన్నారు. ఇదంతా రైతాంగం గమనించాలని, గతంలోని జగనన్న పాలనకు ఇప్పటి చంద్రన్న పాలనకు ఉన్న తేడాను తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు యలకల వాసునాయుడు, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడు బలివాడ నరేంద్ర, నాయకులు బూరాడ వెంకటరావు, కనగల పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.